క్లుప్తంగా

గో సంరక్షణ ట్రస్టుకు విరాళం


నగదు విరాళం చేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి గురువారం ఓ దాత నగదు విరాళం చేశారు. విజయవాడకు చెందిన తెలుగు ఆట్స్ యూత్ సభ్యులు, దాత సాయి గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష, నిత్య అన్నదానానికి రూ.80 వేలు ఇచ్చారు. అనంతరం ఆలయ అధికారులు దాత కుటుంబానికి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు


లాడ్జిలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నరసింహులు

ఐరాల: నేర కార్యకలాపాలను అరికట్టే ప్రయత్నాల్లో భాగంగా గురువారం కాణిపాకంలో ఎస్ఐ నరసింహులు లాడ్జిలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు సోదాలు ముమ్మరం చేశారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి, రికార్డులను పరిశీలించారు. గదులు అద్దెకు తీసుకునే వారి ఆధార్ కార్డు నంబర్, ఫోన్ నంబర్, వ్యక్తిగత చిరునామా తప్పనిసరిగా సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని లాడ్జీల యజమానులకు ఎస్ఐ సూచించారు. లాడ్జీలలో అసాంఘిక కార్యలాపాలు జరగకుండా చూసుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాగ్రత్తలు పాటించాలి


బంగారుపాళెం: సంక్రాంతిపల్లెలో టపాకాయల గోడౌన్‌ను పరిశీలిస్తున్న సీఐ

బంగారుపాళెం: టపాకాయల గోడౌన్ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని సంక్రాంతిపల్లెలో గల లైసెన్స్ టపాకాయల గోడౌను సిబ్బందితో కలసి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాకాయల గోడౌన్ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

హుండీ కానుకల లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న ఆలయ అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని గిరింపేటలో ఉన్న శ్రీదుర్గాంబ దేవస్థాన హుండీ కానుకల లెక్కింపుతో భారీ ఆదాయం వచ్చిందని చైర్మన్ దిలీప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు హుండీ కానుకలను లెక్కించారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ.4.8 లక్షలు వచ్చింది. కార్యక్రమంలో ఈవో తిమ్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధగిరి క్షేత్రానికి భారీ ఆదాయం


అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ మండపంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.17.35 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మునిశేఖర్ తెలిపారు. గురువారం అర్ధగిరి క్షేత్రంలోని మండపంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్వేత పర్యవేక్షణలో హుండీ కానుకలను లెక్కించారు. జూన్ నెల 9వ తేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు 122 రోజులకు హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కించారు. హుండీల్లో భక్తులు ద్వారా బంగారు 3.600 మిల్లీ గ్రాములు, వెండి 102 గ్రాములు వచ్చినట్లు వెల్లడించారు. హుండీలో 122 రోజులకు రూ.17,35,350 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. నగదు, బంగారు, వెండిని బ్యాంకులో ఉంచినట్లు వివరించారు. లెక్కింపులో ఏపీ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఉమామహేష్, ఆలయ సిబ్బంది, రంజిత్‌రెడ్డి, రఘుపతి, భక్తులు పాల్గొన్నారు.


అరగొండ సమీపంలో పూడిపోయిన హంద్రీనీవా కాలువ


ముళ్ల చెట్లు ఏపుగా పెరగడంతో మూసుకుపోయిన కాలువ

సాగునీరు కలేనా ?

హంద్రీనీవా కాలువ పనులకు చంద్రగ్రహణం పట్టింది. ఎలాంటి ప్రాజెక్టులు లేని తవణంపల్లె మండలంలోని పంట పొలాలకు సాగు నీరు ఎప్పటికి అందుతుందో అని కర్షకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పంట కాలువల ద్వారా పొలాలకు సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో చేపట్టిన హంద్రీనీవా కాలువ పనులు అసంపూర్తిగా నిలిచాయి. అనంతరం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పనులు వేగవంతం చేశారు. అయితే మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ ఆగిపోయిన పనులు అక్కడే ఉన్నాయి.

- కూటమి ప్రభుత్వ పాలనలో ముందుకు సాగని హంద్రీనీవా కాలువ పనులు
- పొలాలకు సాగు నీరు అందడం కలేనా ?
- ముళ్లచెట్లతో మూసుకుపోయిన కాలువలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

తవణంపల్లె : కూటమి ప్రభుత్వం వచ్చి ఒకటిన్నర సంవత్సరం గడుస్తున్నా రైతులకు సాగు, తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చూపుతోంది. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయడంలో స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదవుల కోసం ఆరాటపడే ప్రజాప్రతినిధులు హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయడంపై దృష్టి పెట్టడం లేదని రైతులు ప్రజలు, రైతన్నలు వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా కాలువ పనులు

కడప జిల్లాలోని శ్రీనివాసపురం రిజర్వాయర్ నుంచి కేవీ పల్లె మండలం అడవిపల్లె రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి వాయల్పాడు బ్రాంచ్ కెనాల్, నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా హంద్రీనీవా కాలువకు నీరు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేసి కాలువలు ఏర్పాటు చేశారు. అయితే కేవీపల్లె మండలం నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా దామలచెరువు, ఐరాల, తవణంపల్లె మండలాల మీదుగా బంగారుపాళ్యం మండలంలోని సంక్రాంతిపల్లె దగ్గరకు వచ్చి నీవానదిలోకి నీరు కలుస్తుంది. ప్రస్తుతం శ్రీనివాసపురం రిజర్వాయర్ నుంచి అడవిపల్లె రిజర్వాయర్‌కు నీరు చేరింది. అక్కడ నుంచి హంద్రీనీవా కాలువకు నీరు రావాల్సి ఉంది. మండలంలో 2009లో భూసేకరణ పనులు చేపట్టి 2014 వరకు పనులు జరిగాయి. తర్వాత హంద్రీనీవా కాలువ పనుల గురించి పట్టించుకోలేదు.

చెరువులకు అనుసంధానం జరిగేనా..!

హంద్రీనీవా కాలువలో నీరు ప్రవహిస్తే చిన్న కాలువలు ఏర్పాటు చేసి చెరువులకు అనుసంధానం చేసి సాగు నీరు సరఫరా చేస్తామని గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రకటించారు. కానీ కాలువల్లో సిమెంటు కాంక్రీట్ పనులు 90 శాతం వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. పనులు పూర్తయితే చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరు వస్తుందని ఆశించిన రైతులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపుతోంది. మండలంలో ఎలాంటి రిజర్వాయర్లు లేకపోవడంతో హంద్రీనీవా కాలువలో ద్వారా వచ్చే నీరు సాగు, తాగునీరు సమస్య తీరుతుందనే కర్షకుల ఆశలు నెరవేరే పరిస్థితులు కనపడడం లేదు.

పనులు పూర్తి చేయాలి..



హంద్రీనీవా కాలువ పనులు పూర్తి అవుతుందని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాను. అధికారులు రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి కాలువ పనులు చేపట్టారు. కాలువ పనులు పూర్తి చేసి సాగు, తాగునీరు సమస్య తీర్చాల్సి ఉంది.

\- రమేష్‌రెడ్డి, రైతు, గోనెపల్లెకొత్తూరు

సాగు, తాగునీటి సమస్య తీర్చాలి



మండలంలో ఎలాంటి రిజర్వాయర్లు లేవు. వర్షాలు కురిస్తే తప్ప చెరువులకు నీరు రావడం లేదు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తయితే సాగు, తాగునీరు కొరత తీరుతుందని ఆశించాం. కానీ ప్రభుత్వం రైతులకు మొండి చేయి చూపి హంద్రీనీవా కాలువ పనులు గురించి పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

\- పరదేశి, రైతు, చెర్లోపల్లె

రైతుల సంక్షేమం కోసం పాటుపడాలి



కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించింది. రైతులకు సాగు, తాగునీరు అందించడంలో విఫలమైంది. ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న హంద్రీనీవా కాలువను ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడం అన్యాయం. కూటమి నాయకులు కాలువ పనులు పూర్తి చేయాలి.

\- దయాకర్ రెడ్డి, రైతు, కృష్ణాపురం

ఆహ్వానం


విగ్రహ ప్రతిష్టకు విజయానందరెడ్డిని ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

గుడిపాల: మండలంలోని పాపసముద్రం ఆదిఆంధ్రవాడలో ఈనెల 25, 26వ తేదీన నిర్వహించనున్న గంగమ్మదేవి విగ్రహా ప్రతిష్టాపనకు చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డికి ఆ గ్రామస్తులు ఆహ్వానం పలికారు. అమ్మవారు విగ్రహ ప్రతిష్టకు తప్పనిసరిగా హాజరుకావాలని గురువారం ఆయన కార్యాలయంలో గ్రామస్తులంతా కలిసి ఆయనను ఆహ్వానించారు. కచ్చితంగా తాను వస్తానని ఆయన వారికి తెలియజేశారు. సర్పంచులు రజినీకాంత్, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు పరిశీలన


ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు


ఈ–క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ వరలక్ష్మి

గుడిపాల: ఈ–పంట నమోదును వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయశాఖ ఏడీ ఉమ తెలిపారు. గురువారం 189 కొత్తపల్లె, ఏఎల్‌పురం, చిత్తపార, పాపసముద్రం, గుడిపాలలో ఈ–క్రాప్ నమోదును వారు పరిశీలించారు. ఈ–పంట నమోదులో చాలా వెనుకంజలో ఉన్నామని వీఆర్‌ఓలు, వీఆర్‌ఏల సహాయంతో అగ్రికల్చర్ అసిస్టెంట్లు వేగవంతం చేయాలని వారికి సూచించారు. ప్రతి సర్వేనంబర్‌లో ఈ–పంట నమోదు జరగాలన్నారు. వ్యవసాయాధికారి సంగీత పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ నెల 25వ తేదీలోపు నమోదు చేయించుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని పైపల్లెలో రైతులు సాగు చేసిన వరి పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసిన వివరాలు, విస్తీర్ణం, పేరు, పూర్తి వివరాలు ఈ–క్రాప్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

బోధనకే పరిమితం చేయాలి


ఎంఈఓ రుషేంద్రబాబుకు మెమోరాండం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఐరాల: ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని, యాప్‌లను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించి, కేవలం విద్యార్థుల బోధనపై దృష్టి పెట్టేలా చేయాలని కోరారు. శుక్రవారం నుంచి బోధనేతర కార్యక్రమాలు, విద్యాశక్తి కార్యక్రమం బహిష్కరించి కేవలం బోధనకే పరిమితమై బోధనలో మరింత నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఫ్యాప్టో తరపున ఎంఈఓ రుషేంద్రబాబుకు మెమోరాండం అందజేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు దేవరాజులు, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, మోహన్, ఎస్‌టీయూ అధ్యక్షులు సుధాకర్, హరినాథ్, ఉపాధ్యాయులు జనార్ధన్, అమ్ములు, చాముండేశ్వరి, గిరజ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం


పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ అధికారులు

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లె కాలనీలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. దిగువమోదలపల్లె సర్పంచ్ చలపతి సహకారంతో పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో గురువారం కాలనీలో ముళ్లచెట్లు, చెత్తతో నిండి అపరిశుభ్రంగా ఉన్న వీధిని జేసీబీతో శుభ్రం చేయించారు. అదేవిధంగా దిగువమోదలపల్లె కాలనీలో పైపులైన్ల లీకేజీని పరిశీలించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. తాగునీరు వృథా కాకుండా చూడాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మురుగునీరు నిల్వ లేకుండా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దిగువమోదలపల్లె పంచాయతీ కార్యదర్శి రంజని, టి.పుత్తూరు పంచాయతీ కార్యదర్శి గోపి, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశాకార్యకర్త సౌందర్య పాల్గొన్నారు.



నడి రోడ్డులో గోతి

తవణంపల్లె: మండలకేంద్రమైన తవణంపల్లెలో ప్రధాన రహదారిపై గోతి ఏర్పడడంతో వర్షం నీరు నిల్వ చేరి కుంటను తలపిస్తోంది. తేలికపాటి వర్షం కురిసిన గోతిలో నీరు నిండిపోతుంది. వర్షం నీరు రోడ్డుపై నిల్వ చేరడంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. తవణంపల్లె నడిబొడ్డులో పెద్దగోతి ఏర్పడి వర్షం నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు గోతిలో పడి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. నెల రోజుల క్రితం ఈ గోతిలో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. చిత్తూరు–అరగొండ ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతిలో అదుపుతప్పి పడడంతో పలువురు ప్రమాదానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. తేలికపాటి వర్షం కురిసినా కుంటలాగా మారి ప్రమాదానికి నిలయంగా మారుతుంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్లపై నిలుస్తున్న వర్షం నీరును కాలువ తీసి చెరువులకు మళ్లించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎలక్ట్రిక్ బైక్ విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి గురువారం శ్రీ వేంకటేశ్వర ఎలక్ట్రిక్ బైక్స్ ప్రకాష్ ఎలక్ట్రికల్ ఎక్స్‌టెన్షియల్ టూ వీలర్ బైక్ విరాళంగా ఇచ్చారు. రూ.50 వేలు విలువ చేసే ఈ ఎలక్ట్రికల్ బైక్‌ని ఈఓ పెంచల కిషోర్ చేతికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

నేడు గ్రామ కమిటీలపై సమావేశం

బంగారుపాళెం: మండలంలోని కరిడివారిపల్లె, జిల్లేడుపల్లెలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలపై సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు కరిడివారిపల్లె, అనంతరం జిల్లేడుపల్లె పంచాయతీ గ్రామ కమిటీల ఎంపిక చేపట్టనున్నట్లు చెప్పారు. పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సీజేపై దాడియత్నం హేయమైన చర్య

చిత్తూరు అర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడికి యత్నం దేశ చరిత్రలో హేయమైనదని రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కె.గోపినాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాది చేసిన ఈ చర్యను రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగులంతా కలిసి ముక్త కంఠంతో ఖండిస్తున్నామన్నారు. సంబంధిత న్యాయవాదిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్‌కు మెమొరాండం మెయిల్ చేశామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాణసంచా నిల్వలపై తనిఖీలు

చిత్తూరు అర్బన్: అనుమతులు, లైసెన్సులు లేకుండా టపాకాయలు, బాణాసంచా నిల్వ ఉంచితే కేసులు నమోదు చేస్తామని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ హెచ్చరించారు. నగరంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తహసీల్దార్ కులశేఖర్‌తో కలిసి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీనిపై డీఎస్పీ మాట్లాడుతూ దీపావళి వస్తున్న నేపథ్యంలో టపాకాయల విక్రయాల్లో వ్యాపారులు నిబంధనలు పాటించాలన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

వరకట్నం కేసులో భర్తకు ఏడాది జైలు

చిత్తూరు అర్బన్: కట్నం కోసం భార్యను వేధించిన ఎం.వెంకట మోహన్ ప్రసాద్ (44)కు ఏడాది జైలు శిక్ష రూ.2 వేలు జరిమానా విధిస్తూ చిత్తూరులోని మూడో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. తిరుపతికి చెందిన వెంకట మోహన ప్రసాద్‌కు చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లికి చెందిన స్నేహలతతో పెళ్లయ్యింది. 2012 నవంబర్ 26 తేదీన తన భర్త కుటుంబ సభ్యులు తనను వరకట్న వేధింపులకు గురిచేశారని స్నేహలత చిత్తూరులోని మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. భర్త వెంకట మోహన్ ప్రసాద్‌పై నేరం రుజువు కావడంతో ఇతనికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బీ.శిరీష తీర్పునిచ్చారు.

ప్లాంటు ఏర్పాటుకు స్థల పరిశీలన


మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. గురువారం కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్, పబ్లిక్ హెల్త్ విభాగం ఈఈ పుష్పగిరి నాయక్ ఇతర అధికారులు కలిసి కట్టమంచిలోని మామిడికాయల మార్కెట్ యార్డును పరిశీలించారు. ఇక్కడ ప్లాంటు నిర్మాణానికి అనుకూలంగా ఉన్న అంశాలపై చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నీటినాణ్యత పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ హిత విధానాలను అభివృద్ధి చేయడంలో భాగంగా ఎస్టీపీని ఏర్పాటు చేస్తామన్నారు. దాదాపు రూ.34 కోట్లతో ఎస్టీపీ నిర్మాణం జరుగు తుందని.. దీని ద్వారా నగరానికి శుభ్రమైన నీటిని అందించడంతో పాటు, నగరంలో ఉన్న వ్యర్థపునీటిని శుభ్రం చేసి పర్యావరణాన్ని సంరక్షించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.